



కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

పీడీఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లురెడ్డి

ప్రజాశక్తి-నాయుడుపేట

పాదయాత్రలో వాగ్దానాలు ఇచ్చి ముఖ్యమంత్రి అయ్యాక వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయలేదని.. వెంటనే చర్యలు తీసుకోవాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నాయుడుపేటకు విచ్చేసిన ఆయన గురువారం స్థానిక యూటీఫ్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహర్‌రెడ్డి సమస్యలపై మాట్లాడితే వారిపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని.. రాష్ట్రంలో 60 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, 2,45,000 మంది పార్ట్ టైం, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారన్నారు. ఇచ్చిన మాట మేరకు వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండు చేశారు. దేశంలో పంజాబ్, రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లలో సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానానికి ఉత్తర్వులు జారీచేశారని.. ఏపీలో మాత్రం నేటికీ చర్యలు శూన్యమన్నారు. రాష్ట్రంలో నేటికీ సగం మంది ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు జీతాలు చెల్లించకుండా.. పథకాలు ఆగకూడదని అనధికార ఉత్తర్వులు చేయడం వారి నిరంకుశ పాలనకు ఉదాహరణగా చెప్పొచ్చన్నారు. ఉద్యోగులపై ఇలాంటి నిర్లక్ష్య ధోరణి మానుకోవాలన్నారు. 57 వేల ఉపాధ్యాయ పోస్టులు రాష్ట్రంలో ఖాళీగా ఉన్నాయని.. ఆ పోస్టులు వెంటనే రద్దు చేసేందుకు నేడు రేషనలైజేషన్ చేసి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించకుండా అర్ధరాత్రి ఉద్యోగుల బదిలీలు ప్రకటించారని.. వాటిలో అనేక అవకతవకలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో యూటీఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు రాజశేఖర్, యూటీఫ్ శాఖ అధ్యక్షులు సుబ్బారావు, రామ్మూర్తిరాజు, యూటీఫ్ నాయకులు ముకుంద, వెంకటేశ్వర్లు, పుట్టయ్య, నాయుడుపేట ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



20 నుంచి పీజీ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-క్యాంపస్

శ్రీవేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పీజీ సప్లిమెంటరీ పరీక్షలు జనవరి 20వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ భీమన్న ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పీజీ సప్లమెంటరీ పరీక్షలు రాసేందుకు ఫీజును చెల్లించాలని సూచించారు. ఈ సప్లమెంటరీ పరీక్ష ఫీజును డిసెంబర్ 18వ తేదీ లోపు చెల్లించాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు స్టడీ సెంటర్‌లో సంప్రదించాలని రీజినల్ కోఆర్డినేటర్ డాక్టర్ భీమన్న తెలిపారు.

విమానాశ్రయంలో 'శ్రీవాణి' టికెట్ కౌంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-రేణిగుంట

రేణిగుంట అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికులకు కరెంటు బుకింగ్‌లో శ్రీవారి దర్శన టిక్కెట్లు అందుబాటులో ఉండేలా శ్రీవాణి ట్రస్టు కౌంటర్ ఏర్పాటు చేసింది. తిరుపతి ఎంపీ గురుమూర్తి చేసిన ప్రయత్నాలు ఫలించాయి. గురువారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం చేతుల మీదుగా కౌంటర్ ప్రారంభించారు. తిరుపతి విమానాశ్రయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌గా విమానాశ్రయ అభివృద్ధికి శ్రమిస్తున్న ఎంపీ గురుమూర్తి గతంలో ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్, అధికారుల దష్టికి తీసుకెళ్లారు. శ్రీవాణి ట్రస్టు కరెంటు బుకింగ్ కౌంటర్ విమానాశ్రయంలో ఏర్పాటు చేయడంతో ప్రయాణికులు అప్పటికప్పుడు దర్శనం చేసుకొనేందుకు టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని.. తద్వారా విమానాశ్రయంలో ప్రయాణికుల రద్దీ పెరుగుతుందన్నారు. కౌంటర్ ఏర్పాటుకు సహకరించిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, తితిదే ఛైర్మన్ సుబ్బారెడ్డి, ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ జవహర్‌రెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ఎయిర్పోర్ట్ డీజీఎం టెర్మినల్ చంద్రకాంత్, కమర్షియల్ మేనేజర్ అవినాష్, టెర్మినల్ మేనేజర్ మణిదీప్, టీటీడీ ఐటీ విభాగం ఎం సందీప్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఐఎఫ్‌ఎస్ కృషి

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

దేశవ్యాప్తంగా క్రీడాకారులను మరింతగా ప్రోత్సహించేందుకు ఇండియన్ స్పోర్ట్స్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామని వ్యవస్థాపక అధ్యక్షులు జి.భార్గవ్ తెలిపారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 17, 18న తిరుపతి శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ వేదికగా మొట్టమొదటిసారిగా ఐఎఫ్ఎస్ ఆధ్వర్యంలో కరాటే, బాడీ బిల్డింగ్, బ్యాడ్మింటన్ నిర్వహించడానికి సన్నాహాలు చేశామన్నారు. శుక్రవారం సాయంత్రం లోపు కరాటే పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ పేర్లను కాంప్లెక్స్ వద్ద నమోదు చేసుకోవాలని కరాటే శిక్షకులు రత్నాకర్ తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్ఎస్ ఉపాధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్ నాయుడు, ఐఎఫ్ఎస్ సభ్యులు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పరిహారం అందించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మాండూస్ తుపాన్ కారణంగా వేసిన పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఉదారంగా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజనల్ అధికారికి, వ్యవసాయశాఖ ఏడీఏకు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ జిల్లాలో తుపాన్ కారణంగా రైతులు భారీగా నష్టపోయారన్నారు. వారికి ఎకరాకు కనీసం రూ.25 వేలు కనీస పరిహారం చెల్లించాలని డిమాండు చేశారు. చెరువు గండ్లను, రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం మాజీ జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య, ఉపాధ్యక్షులు రంగయ్య, పెనగడం గురవయ్య, వెంకటేశ్వరరావు, గెడి వేణు పాల్గొన్నారు.

నకిలీ విలేకర్లపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ప్రజాశక్తి-సత్యవేడు

తిరుపతి జిల్లా సత్యవేడులో చలామణి అవుతున్న నకిలీ విలేకర్లను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గురువారం సత్యవేడు ప్రింట్ మీడియా అసోసియేషన్ సభ్యులు ఎస్సై పురుషోత్తంరెడ్డికి ఫిర్యాదు చేశారు. సత్యవేడు పట్టణంలో గత కొంతకాలంగా నకిలీ విలేకర్లు చలామణి అవుతున్నారని.. పత్రికల్లో పనిచేసే మండల రిపోర్టర్లకు పత్రికా యాజమాన్యం సిఫార్సు మేరకు సంబంధిత జిల్లా కలెక్టర్ అక్రిడిటేషన్ కార్డు ఇవ్వడం జరుగుతోందని.. కొన్ని కారణాలతో అక్రిడిటేషన్ లేనిపక్షంలో యాజమాన్యం గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇవేవీ లేకుండా కొందరు నకిలీల ముసుగులో విలేకర్లుగా పనిచేస్తున్నట్లు సభ్యులు ఆరోపించారు. వారి కారణంగా అసలైన విలేకర్లకు ఇబ్బందికరంగా మారిందని వాపోయారు. కొందరు ప్రెస్ స్టిక్కర్స్ వాహనాలపై అతికించి తిరుగుతున్నారని.. విచారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సత్యవేడు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు రామచంద్రయ్య, గౌరవ అధ్యక్షులు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు నాగరాజు, కార్యదర్శి సోమురెడ్డి, సభ్యులు సలీంబాషా, విగ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

మౌలానా ఆజాద్ ఫెలోషిప్స్‌ని కొనసాగించాలి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

మౌలానా ఆజాద్ ఫెలోషిప్స్‌ని యథావిధిగా కొనసాగించాలని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థులు ఎఐఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ వామనరావు భవన్‌లో జరిగిన నిరసన ఉద్దేశించి అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్‌కుమార్, బండి చలపతి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మైనార్టీ విద్యార్థుల పట్ల చిన్నచూపు చూస్తోందన్నారు. ఎప్పటినుంచో సెంట్రల్ యూనివర్సిటీలలో మౌలానా ఆజాద్ ఫెలోషిప్‌ని రద్దు చేయడం వల్ల ముస్లీం, క్రిస్టియన్, బౌద్దిస్ట్, జైన్, సిక్కుల విద్యార్థులు పీహెచ్‌డికి దూరం అవుతున్నారని అన్నారు. ఇదంతా కేవలం దేశంలో రాజకీయ కుట్రతో చేస్తున్నారని, హిందువుల ఓట్‌బ్యాంక్‌ని తమకు అనుకూలంగా మార్చుకోడానికి, యూనివర్సిటీలలో కులాలు, మతాల పేరుతో చిచ్చు పెట్టి దేశ ఐక్యతను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్నారన్నారు. దీన్ని చూస్తూ ఊరుకోబోమని, యథావిధిగా మౌలానా ఆజాద్ ఫెలోషిప్‌ను కొనసాగించకపోతే ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆఫీసు బేరర్స్ చిన్న, ప్రవీణ్, సుందర్, వినయ్, ఓంరాజ్, ప్రసాద్, మానస, గ్రేస్, శివాణి, చంద్రనాయక్, ఉదయ్, సురేంద్ర, గిరి పాల్గొన్నారు.

బాధితులకు సాయం

ప్రజాశక్తి-చిల్లకూరు: చిల్లకూరు మండలం తిప్పకుంటపాలెం తుపాన్ బాధితులను గురువారం గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులకు కూరగాయలు పంపిణీ చేశారు. గ్రామానికి బోటలో వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో తహసీల్దారు స్వర్ణ, నాయకులు కుమారస్వామిరెడ్డి పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

ప్రజాశక్తి-కోట

ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే జగనన్నకు శ్రీరామరక్షని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు అన్నారు. గురువారం మండలంలోని కొక్కుపాడు పంచాయతీ పరిధిలో దళితవాడ, సూరిశెట్టి పాలెం, ఇల్లకూరుపాడు కాలనీల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి జగనన్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. లేదా అడిగి తెలుసుకున్నారు. స్కూల్ పక్కనే వర్షపునీరు నిల్వ ఉండటంతో ఇబ్బందిగా ఉందని పిల్లల తల్లిదండ్రులు ఎమ్మెల్యే దష్టికి తీసుకొచ్చారు. అనంతరం గోయిందపల్లిపాలెంలో తుపాన్ బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో కిరణ్ కుమార్, తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీవో భవాని, ఎంఈవో వెంకటసునీల్ వైసీపీ నాయకులు యర్రటపల్లి మధుసూదన్‌రావు, మండల కన్వీనర్ సంపత్‌కుమార్‌రెడ్డి , మొబీన్‌బాషా, హరీష్, చంద్రారెడ్డి, వంశీ, కష్ణారెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మారనున్న భారత విశ్వవిద్యాలయాల భవిత

పూర్వ ఉపకులపతి ఆచార్య కె.బాలవీరారెడ్డి

ప్రజాశక్తి-క్యాంపస్

నూతన విద్యావిధానం-2020 తో భారతదేశంలోని విశ్వవిద్యాలయ స్వరూప, స్వభావాలు పూర్తిగా మారబోతున్నాయని విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్సిటీ, కర్ణాటక , పూర్వ ఉపకులపతి ఆచార్య కె.బాలవీరారెడ్డి అన్నారు. ఎస్వీయూ సెనేట్ హాల్లో ఎస్వీయూ అధ్యాపకులకు యన్ఐఆర్ఎఫ్ (నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్) ర్యాంకులో అత్యుత్తమ గ్రేడ్ సాధించడమెలా అనే అంశంపై గురువారం దిశానిర్దేశం చేశారు. నూతన విద్యావిధానం ద్వారా విద్యార్థులకు మల్టీ డిసిప్లీన్ విద్య అందుబాటులోకి వచ్చిందన్నారు. 2035 నాటికి దేశంలో మూడు రకాల విశ్వవిద్యాలయాలు ఏర్పాటవుతాయని, బోధన, పరిశోధన, సమ్మిళిత విశ్వవిద్యాలయాలుగా అన్నీ రూపాంతరం చెందబోతున్నాయన్నారు. ఎస్వీయూ రెక్టార్ ఆచార్య శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్వీయూ బోధన సిబ్బందిలో భాగమైన అకడమిక్ కన్సల్టెంట్లు పరిశోధన రంగంలో ప్రతిభ చూపాలని కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య మహమ్మద్ హుస్సేన్, ఎస్వీయూ న్యాక్ డైరెక్టర్ ఆచార్య యం.శ్రీనివాసులురెడ్డి, డీన్ ఆచార్య విజయభాస్కరరావు, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.



ఆసియా చదరంగంలో అక్కాచెల్లెళ్ల ప్రతిభ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

ఆసియా చదరంగంలో ప్రతిభ చూపిన తిరుపతికి చెందిన అక్కాచెల్లెళ్లలను మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి గురువారం సన్మానించారు. 16 ఆసియా స్కూల్స్ చదరంగం ఛాంపియన్‌షిప్-2022 చరిత్రలో మొదటసారిగా భారతదేశంలోని తిరుపతికి చెందిన అక్కాచెల్లెళ్లు ప్రత్యేక ఘనత సాధించారు. డిసెంబర్ 3వ తేదీ నుంచి పదో తేదీ వరకు శ్రీలంకలో జరిగిన చదరంగం ఛాంపియన్‌షిప్‌లో మన దేశం తరపున తిరుపతికి చెందిన త్రిపురాంబిక, శ్రీగురువర్షిణి ప్రాతినిధ్యం వహించారు. అండర్-11 బాలికల విభాగంలో ఛాంపియన్, రాపిడ్ విభాగాల్లో త్రిపురాంబిక రన్నరఫ్‌తో రెండు రజిత పతకాలు సాధించారు. అండర్-7 బాలికల విభాగంలో మూడు స్వర్ణ పతకాలను కైవసం చేసుకుని సత్తా చాటారు. ఇరువురు దేశ కీర్తి ప్రతిష్టలను చాటి జాతీయ జెండాను శ్రీలంక గడ్డపై అక్కాచెల్లెళ్లు రెపరెపలాడించారు. ఈ సందర్భంగా తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఉదయం సన్మానించారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ చంద్రమౌళేశ్వర రెడ్డి, సూపరింటెండెంట్ రవి, గీతం స్కూల్ కరస్పాండెంట్ తదితరులు పాల్గొన్నారు.

అనీమియా నివారణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

'స్పందన' వినతులు సకాలంలో పరిష్కరించాలని, హౌసింగ్ లే-అవుట్ లలో నిర్మాణాలు మరింత వేగవంతం చేయాలని, సుస్థిర అభివద్ధి లక్ష్యాల అమలులో అనీమియా, ప్రసూతి మరణాలు లేకుండా చూడాలని సి.ఎస్. జవహర్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లను, జాయింట్ కలెక్టర్ లను ఆదేశించారు. గురువారం ఉదయం అమరావతి నుండి పంచాయితీ రాజ్ కమీషనర్ కోనా శశిధర్, సిద్ధార్థ జైన్, సంబందిత కమీషనర్లు, కార్యదర్శులతో కలసి అన్నిజిల్లాల కలెక్టర్లతో, జాయింట్ కలెక్టర్ లతో వర్చువల్ విధానంలో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణ రెడ్డి, జే సి డి.కే బాలాజీ తో కలిసి సంబంధిత అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ స్పందన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, బియాండ్ ఎస్.ఎల్.ఎ కి వెళ్ళకుండా అర్ధవంతంగా పరిష్కారం చూపించి సంబందిత అర్జీదారునితో క్షేత్ర స్థాయి ఫోటో యాప్ లో అప్ లోడ్ చేయాలన్నారు. నవరత్నాలు పేదలందరికీ ఇళ్ళ పథకంలో భాగంగా జగనన్న కాలనీలో ఇళ్ళ నిర్మాణాలను స్టేజ్ వారీగా కన్వర్షన్ లో పురోగతి ఉండేలా వేగవంతం చేయాలని తెలిపారు. హాస్పిటల్ డెలివరీ లను ప్రోత్సహించి మాతా శిశు మరణాలు తగ్గించే దిశలో జిల్లాలో ముఖ్యంగా వారంలోపు కాన్పు అయ్యే మహిళల జాబితా సిద్ధం చేసుకొని వారికి మాతా శిశు మరణాలు జరగకుండా అన్ని రకాల జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని, అనీమియా పరీక్షలు జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, సమతుల్యమైన ఆహారం పై పిల్లలు, తల్లులు విద్యార్థులకు అవగాహన కల్పించి అనీమియా బారిన పడకుండా తల్లులు, పిల్లలను కాపాడాల్సిన బాధ్యత ఉందని ఈ అంశంపై వచ్చేవారం సమీక్ష ఉంటుందని, సుస్థిర అభివద్ధి లక్ష్యాలు సూచికలపై దష్టి పెట్టి పురోగతి సాధించాలని అన్నారు.

ఈ సమావేశంలో డిఆర్ఓ శ్రీనివాస రావు, ఏడి సర్వే జయరాజ్, జిల్లా ప్లానింగ్ స్టాటిస్టికల్ అధికారి అశోక్ కుమార్, డిఎల్‌డిఓ సుశీల దేవి, జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖా అధికారిణి జయలక్ష్మి, హౌసింగ్ పిడీ శ్రీనివాస ప్రసాద్, డిఎంహెచ్ఓ శ్రీహరి, డి.పి.ఓ. రాజశేఖర్ రెడ్డి, ఎస్ఈఆర్‌డబ్ల్యుఎస్ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలని మంత్రికి వినతి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

తాము వందల ఏళ్ల నుంచి ఉంటున్న ఇళ్లను ఖాళీ చేయాలని కోరుతూ రైల్వే అధికారులు నోటీసులు ఇచ్చారని .. తమను ఆదుకోవాలని కోరుతూ గురువారం రాష్ట్ర మైనార్టీసెల్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహీన్ ఆధ్వర్యంలో నగరిలో మంత్రి ఆర్‌కే రోజాను కలిసి విన్నవించారు. తరతరాలుగా నివాసం ఉంటున్నామని.. ప్రస్తుతం ఖాళీ చేయాలని నోటీసులు ఇవ్వడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామన్నారు. నోటీసులు జారీచేసిన ప్రాంతంలో మసీదులు, ఆలయాలు ఉన్నాయని తెలిపారు. రైల్వేశాఖ మంత్రి, రైల్వే జీఎంతో చర్చించి న్యాయం చేస్తానని వారికి హామీ ఇచ్చారు.



శ్రీవారి సేవలో నటుడు రజనీకాంత్

ప్రజాశక్తి -తిరుమల సినీనటుడు రజనీకాంత్ గురువారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవారి సుప్రభాత సేవలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. కూతురు ఐశ్వర్య రజనీకాంత్‌తో కలిసి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలు రజనీకాంత్‌ను చూడటానికి భక్తులు ఉత్సాహం చూపారు. తిరుమల శ్రీవారిని దర్శనం అనంతరం నేరుగా రజనీకాంత్ కడపకు వెళ్లారు. అక్కడ కొలువైన అమీన్‌పీర్ దర్గాను దర్శించుకున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ రెహమాన్‌తో పాటు రజనీ దర్గాను సందర్శించారు.

శ్రీవారి సేవలో రాష్ట్ర మంత్రులు తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో రాష్ట్ర మంత్రులు ధర్మాన ప్రసాదరావు, గమ్మనూరు జయరాం, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈవో ధర్మారెడ్డి కోర్టు ధిక్కరణ కేసులో...

అప్పీలుపై విచారణ 16కు వాయిదా

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డిపై కోర్టు ధిక్కరణ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలుచేస్తూ.. ఆయన వేసిన అప్పీల్‌పై విచారణ ఈనెల 16కు వాయిదా పడింది. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్తులో ప్రోగ్రాం అసిస్టెంట్లుగా ముగ్గురి సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అమలు చేయకపోవడంతో కోర్టు ధిక్కరణ కేసులో టీటీడీ ఈవో ధర్మారెడ్డికి నెల రోజుల సాధారణ జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి ఈనెల 13న తీర్పు ఇచ్చారు. కోర్టు ధిక్కరణ కేసులో నెల రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ఏవీ ధర్మారెడ్డి దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణ ఈనెల 16కు వాయిదా పడింది. ఈవో అఫిడవిట్ కోర్టు రికార్డుల్లోకి చేరకపోవడంతో విచారణను వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ దుప్పల వెంకటరమణతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలిచ్చింది. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్తులో ప్రోగ్రాం అసిస్టెంట్లుగా ముగ్గురి సర్వీసును క్రమబద్ధీకరించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అమలు చేయకపోవడంతో కోర్టుధిక్కరణ కేసులో టీటీడీ ఈవో ధర్మారెడ్డికి నెల రోజుల సాధారణ జైలుశిక్ష, జరిమానా విధిస్తూ సింగిల్ జడ్జి ఈనెల 13న తీర్పు ఇచ్చారు. ఆ తీర్పుపై అదే రోజు టీటీడీ లైజనింగ్ అధికారి అఫిడవిట్ ఇస్తూ అత్యవసరంగా అప్పీల్ వేశారు. విచారణ 14కు వాయిదా పడింది. అప్పీల్‌పై ధర్మాసనం విచారణ జరిపింది. ఈవో తరపున సీనియర్ న్యాయవాది ఎస్ఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించలేదన్నారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలపై అప్పీల్ దాఖలు చేశామన్నారు. తేదీల వివరాలను ధర్మాసనం దష్టికి తీసుకొచ్చారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, యంత్రాంగం

అమరజీవి పొట్టి శ్రీరాములు 70వ వర్ధంతిని శ్రీకాళహస్తిలో గురువారం టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ప్రత్యేకాంధ్రా కోసం పొట్టి శ్రీరాములు పోరాడి అమరుడైన సందర్భాన్ని టీడీపీ పట్టణ అధ్యక్షుడు జి .విజయకుమార్ గుర్తు చేశారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని నేటితరం ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, దశరథ ఆచారి, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని గురువారం గూడూరులోని టీడీపీ కార్యాలయంలో గూడూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం ఏర్పడేందుకు కారణమైన పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా 1985 లో నందమూరి తారక రామారావు హైదరాబాదులో శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో గూడూరు పట్టణ, మండల అధ్యక్షులు పులిమి శ్రీనివాసులు, కొండూరు వెంకటేశ్వరరాజు, పార్లమెంట్ అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, పార్లమెంట్ క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు తాతపూడి ఇజ్రాయేల్ కుమార్, పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు తాళ్ల సుబ్బమ్మ, జిల్లా వాణిజ్యవిభాగం రాష్ట్ర కార్యదర్శి వల్లూరు మోహన్ , జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.



తిరుపతి మంగళం: ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పొట్టిశ్రీరాములు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. టాస్క్ ఫోర్సు లోని సివిల్, ఏపీఎస్పీ, ఏఆర్, ఫారెస్ట్ అధికారులు, సీఐలు చంద్రశేఖర్, బాలకష్ణ, ఆర్ఐ సురేష్ కుమార్‌రెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సుబ్బారావు, ఆర్ఎస్ఐలు, ఎఫ్ఆర్ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రేణిగుంట: ఆషా సంస్థ కార్యాలయంలో గురువారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించారు. సంస్థ అధ్యక్షులు జూలియన్‌రాజు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణాలర్పించిన ఆయనను ఆంధ్రులు ఎన్నటికీ మరువరన్నారు. కార్యక్రమంలో ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ ముఖ్య సలహాదారులు అమ్ములురాజు, సంస్థ కార్యదర్శి మునీంద్రా, కమిటీ మెంబర్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టిశ్రీరాములు వర్ధంతి సందర్భంగా గురువారం బాలాయపల్లి రెవెన్యూ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. తహసీల్దారు అజ్మతుల్లా ఖాన్, రెవెన్యూ సిబ్బంది

ఘనంగా ఏడు గంగమ్మల జాతర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఏడు గంగమ్మల జాతర పట్టణంలో ఘనంగా జరిగింది. బుధవారం రాత్రి ఏడు గంగమ్మలను పట్టణంలోని ఏడు ప్రాంతాల్లో నిలబెట్టారు. గురువారం భక్తులు ఏడు గంగమ్మలను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆలయ వేద పండితులు ఏడు గంగమ్మలకు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. స్థానిక పెళ్లి మండపం వద్ద వెలసిన పొన్నాలమ్మ వద్ద భక్తులకు శ్రీకష్ణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ట్రస్టు వ్యవస్థాపకులు మల్లెంబాకం మునికష్ణారెడ్డి అంబలి ప్రసాదం అందించారు. స్వర్ణమూర్తి, పన్నీరుకుప్పం శేఖర్, బాల గౌడ్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో సంఘమిత్ర

ప్రజాశక్తి-వరదయ్యపాళెం

వరదయ్యపాళెం మండలంలోని వెలుగు సమాఖ్యలో డ్వాక్రా రుణాలను పక్కదారి పట్టించిన విషయం చర్చనీయాంశంగా మారింది. డీఆర్‌డీఏ ఉన్నతాధికారులు, బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం సీఐ శివకుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సంఘమిత్ర యువరాజును అదుపులోకి తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివరణ చేపట్టి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించనున్నట్లు సమాచారం. సంఘమిత్ర యువరాజు విచారణలో పలు విషయాలు వెలుగు చూసే అవకాశం ఉందని, నిజానిజాలు బయటపడే వీలుందని స్థానికులు భావిస్తున్నారు.



విద్యుత్ పొదుపుపై అవగాహన తప్పనిసరి

ప్రజాశక్తి-గూడూరు రూరల్

దేశవ్యాప్తంగా జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు డిసెంబర్ 14 నుంచి 20వ తేదీ వరకు జరుగుతున్న సందర్భంగా గూడూరు విద్యుత్‌శాఖ ఇంజినీర్ కార్యాలయంలో విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఇంజినీర్ ఇస్మాయేల్ మాట్లాడుతూ ఇంధన పొదుపు విద్యుత్తు వినియోగదారులు తెలుసుకోవాలన్నారు. భావితరాలకు విద్యుత్ అవసరం ఎంతో ఉపయోగకరంగా ఉండాలంటే ప్రతిఒక్కరూ పొదుపు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ శ్రీనివాసులు, ఏవో ఆశాలత పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు కల్లివెట్టు విద్యార్థి ప్రదర్శన

ప్రజాశక్తి-బీఎన్‌కండ్రిగ



స్థానిక ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ ప్రదర్శనలో కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న గణేష్ తయారు చేసిన బ్యాటరీ ప్రయోగం జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రమణయ్య తెలిపారు. పాఠశాల భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడు ప్రసాద్ పర్యవేక్షణలో అందుబాటులో ఉన్న వాడేసిన వ్యర్థాలతో తయారుచేసిన బ్యాటరీ సామాన్య ప్రజలకు ఉపయోగకరమని.. విద్యార్థి సొంత ప్రతిభకు ఉపాధ్యాయులు అభినందించారు.

పంచాయతీల అభివృద్ధికి సర్పంచుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

పంచాయతీల అభివద్ధిపై సర్పంచులు దష్టి పెట్టాలని.. సర్పంచులదే కీలక పాత్రని ఎంపీపీ మునివేలు అన్నారు. గురువారం గ్రామ పంచాయతీల అభివద్ధి ప్రణాళికపై సర్పంచులు, ఎంపిటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రధానంగా పర్యవేక్షణ ఉండాలని, డ్రైనేజీ కాలువలు, రోడ్ల సమస్య లేకుండా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణాధికారి రవికుమార్, ఎంఈవో తిరుమలరాజు, వైస్ ఎంపీపీలు పాల్గొన్నారు.

రైతులు ఈ-పంటను నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-బీఎన్‌కండ్రిగ

రైతులందరూ ఈ-పంట నమోదు చేసుకోవాలని ఏవో భారతి తెలిపారు. మండలంలోని రైతులు రైతు భరోసా కేంద్రంలో ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని.. పాసు పుస్తకం, 1-బి నమూనా, ఆధార్, ఫోన్ నంబర్లతో సంప్రదించాలని కోరారు. ప్రకతి వైపరీత్యాలు సమయంలో పంట నష్టపరిహారం, మద్దతు ధరపై పంట కొనుగోలు చేయడంలో అర్హులుగా పరిగణించబడుతారని తెలిపారు.

అంజిబాబు సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-రేణిగుంట

దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ క్యారేజ్ రిపేర్ షాప్ మాజీ ఛైర్మన్, కేంద్ర వర్కింగ్ కమిటీ సభ్యులు అంజిబాబు సంఘ్‌కు చేసిన సేవలు చిరస్మరణీయమని ఎన్ఎఫ్ఐఆర్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య ఆనందం వ్యక్తం చేశారు. సికింద్రాబాద్‌లో జరుగుతున్న 110వ జనరల్ కౌన్సిల్ సమావేశంలో భాగంగా గురువారం అంజిబాబును డాక్టర్ మర్రి రాఘవయ్య సత్కరించారు. కార్యక్రమంలో ప్రభాకర్, భరణి, భానుప్రసాద్, సీపీ శర్మ, కార్మికులు పాల్గొన్నారు.

సైదలికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖలో పరిశోధక విద్యార్థి పాలెం సైదలికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షలు నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగు అధ్యయన శాఖలోని విశ్రాంత అధ్యాపకులు ఆచార్య పేటా శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో 'తొండమనాడు కథలు-పరిశీలన' అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను ఆయనకు డాక్టరేట్ ను ప్రదానం చేసినట్లు వెల్లడించారు. పాలెం సైదలికి డాక్టరేట్ అవార్డు రావడంపై పలువురు ఆచార్యులు, పరిశోధకులు, స్నేహితులు, బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-కోట: హైదరాబాద్‌కు చెందిన చలంచర్ల వెంకటసుబ్రహ్మణ్యం, వేణుగోపాల్‌రావు దాతత్వంతో తండ్రి ప్రభాకర్‌రావు జ్ఞాపకార్థం నెల్లూరుపల్లి కొత్తపాలెం గిరిజన కాలనీలో అన్నదానం చేశారు. అలాగే పేదలకు దుప్పట్లు అందించారు.

పన్ను బకాయిలకు నోటీసులు జారీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

నగరపాలక సంస్థ పరిధిలో ఆస్తి పన్నులు కట్టకుండా ఉన్న మొండి బకాయిదారులకు రెడ్ నోటీసులు జారీ చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అనుపమ అంజలి, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ ఆదేశాలు జారీచేశారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మేయర్ చాంబర్లో రెవెన్యూ సిబ్బందితో గురువారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మేయర్, కమిషనర్ మాట్లాడుతూ సచివాలయం పరిధిలో రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్ భవనాల వారీగా విభజించాలని, మొండి బకాయిదారులు పన్నులు చెల్లించకపోతే నగరపాలక సంస్థ అందిస్తున్న సదుపాయాలను తొలగించాలని అధికారులను



ఆదేశించారు. ఇచ్చిన టార్గెట్‌ను పూర్తి చేసి, వందశాతం ఆస్తి పన్నులు రాబట్టాలని, ఆయా వార్డుల ద్వారా ఆస్తి పన్నులు వసూలు, నగరపాలక సంస్థ పరిధిలో సచివాలయాల వారీగా నగరంలో కొత్తగా కడుతున్న అపార్ట్‌మెంట్లు, భవనాలకు కొత్త పన్నులు వేయాలన్నారు. సచివాలయ సిబ్బందితో డిమాండు నోటీసులు ఇప్పించాలని, ఖాళీ స్థలాలకు పన్నులు వేయాలని సూచించారు. ప్రతి ఆరునెలలకు ఓసారి ఆస్తి పన్నులు, ట్రేడ్ లైసెన్స్, తాగునీటి పన్నులు, యూజీడీ పన్నులు కట్టాలని ప్రజలకు సూచించారు. నగరంలో ప్రతిఒక్కరికీ అన్ని సదుపాయాలు కల్పిస్తామని.. పెండింగ్‌లో ఉన్న వాటిని 15 రోజులు లోపల కట్టి నగరపాలక అభివద్ధికి తోడ్పడాలన్నారు. సమావేశంలో ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతు మాధవ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు రాజశేఖర్, మధుసూదన్ రెడ్డి, ప్రకాష్, సూరిబాబు, శంకరయ్య, నవీన్ కుమార్, జ్యోతిష్, శ్రీనువాసులురెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రెవెన్యూ సూపరింటెండెంట్ నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఫిబ్రవరిలోపు 'భూహక్కు' పత్రాల పంపిణీ పూర్తి : కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి అధికారులకు సూచించారు. గురువారం విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం (సమగ్ర సర్వే) కార్యాచరణ, అమలు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో స్పెషల్ సీఎస్ సాయిప్రసాద్ వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్‌వో శ్రీనివాసరావు, ఏడీ సర్వే జయరాజ్ తదితరులు వీడియో కాన్ఫరెన్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీసీఎల్‌ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మ్యుటేషన్ కరెక్షన్, ట్రాన్సాక్షన్, కోర్ట్ కేసులో పురోగతి తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ శాశ్వత జగనన్న భూహక్కు- భూరక్ష పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోపు పూర్తయ్యేలా చూడాలని తెలిపారు. మ్యుటేషన్స్ కోసం అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో పీవోఎల్ఆర్ శిక్షణ కార్యక్రమం పూర్తయిన నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఫారం-8 జనరేట్ చేసి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. కేటగిరి-4 కు గాను 17 ఓ.ఆర్.ఐ లు అందాయని.. వేగవంతం చేయాలన్నారు. సర్వేకు వెళ్లే ముందు చుట్టుపక్కల భూముల వారికి నోటీసులు ఇచ్చి సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మ్యుటేషన్స్ కోసం అందిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పూర్తి చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు.

'సహకార బంధు' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-సత్యవేడు

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నూతనంగా ప్రవేశపెట్టిన సహకార బంధు పథకాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి జిల్లా సత్యవేడు డీసీసీ బ్యాంకు మేనేజర్ తేజస్వి కోరారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సహకార బంధు పథకానికి సంబంధించి డిపాజిట్ స్వీకరణ డిసెంబరు 16 నుంచి 31వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. 555 రోజులు ఈ పథకం కాల పరిమితిగా ఉంటుందని పేర్కొన్నారు. కనిష్ట డిపాజిట్ రూ.1000 పైనే స్వీకరించడం జరుగుతుందన్నారు. డిపాజిట్ చేసిన వారికి సాధారణ ఖాతాదాలకు 7.25 శాతం వడ్డీ, సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ చెల్లించడం జరుగుతుందన్నారు. రీ ఇన్వెస్ట్మెంట్ పథకం డిపాజిట్లపై సాధారణ వడ్డీ 7.70 శాతం, సీనియర్ సిటిజన్‌లకు 8.54 శాతం చెల్లిస్తామన్నారు. ఖాతాదారుల డిపాజిట్లపై డీఐసీజీసీ ఇన్సూరెన్స్ రక్షణ ఉంటుందని తెలిపారు. సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు చేసుకొని వాణిజ్య బ్యాంకులు కంటే అదనపు వడ్డీ పొందాలని కోరారు. ఈ సదవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు సత్యవేడు కేంద్ర సహకార బ్యాంకు అధికారులను సంప్రదించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే వెంకటరమణకు నివాళి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి మాజీ శాసనసభ్యులు ఎమ్.వెంకటరమణ ఎనిమిదో వర్ధంతి సందర్భంగా కపిలతీర్థం ఘాట్ వద్ద టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మన్నూరు సుగుణమ్మ, కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. పెద్దఎత్తున టీడీపీ కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులు అర్పించి అన్న దానం చేపట్టారు. మీడియాతో మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ మాట్లాడుతూ వెంకటరమణ ఏ ఆశయ సాధన కోసం అయితే తిరుపతి నగరంలో ప్రజా నాయకుడిగా సేవలందించారో తాను ఓ మాజీ శాసనసభ్యురాలుగా ఆయన ఆశయ సాధన కోసం సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సుగుణమ్మ కుటుంబ సభ్యులు బీఎల్ సంజయ్, టీడీపీ



నగర అధ్యక్షులు చినబాబు, జేబీ శ్రీనివాసులు, టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికష్ణ, ఊక విజయ్‌కుమార్, బుల్లెట్ రమణ, ఆముదాల తులసీరామ్, కంకణాల రజనీకాంత్ నాయుడు, కుమార్ పాల్గొన్నారు.

విమానాశ్రయాల అభివృద్ధికి కేంద్రం చర్యలేవి? : ఎంపి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

విమానాశ్రయాలలో ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏదైనా పథకాన్ని ప్రతిపాదించిందా.. విమానాశ్రయాలలో నాణ్యమైన మౌలిక సదుపాయాలను చేపట్టేందుకు అంతర్జాతీయ ప్రమాణాలను అనుసరిస్తుందా..? వివరాలివ్వాలని.. విమానాశ్రయాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్రాల వారీగా నిధులు మంజూరు చేశారా అని తిరుపతి ఎంపీ గురుమూర్తి గురువారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఇందుకు సమాధానంగా కేంద్ర విమానయాన శాఖ సహాయ మంత్రి డా.వి.కె.సింగ్ సమాధానం ఇస్తూ విమానాశ్రయాల అభివద్ధి, ఆధునీకరణ అనేది నిరంతర ప్రక్రియ అని, భూమి లభ్యత, వాణిజ్య సాధ్యత, సామాజిక-ఆర్థిక పరిగణనలు, ట్రాఫిక్ డిమాండ్ ఆధారంగా ఎప్పటికప్పుడు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), ఇతర ఎయిర్‌పోర్ట్ డెవలపర్లతో చేపట్టబడుతుందన్నారు. రాబోయే ఐదేళ్లలో ప్రస్తుత టెర్మినల్స్, కొత్త టెర్మినల్స్, రన్‌వేలను బలోపేతం చేయడం, ఇతర పనులు చేయడం విమానాశ్రయ రంగంలో సుమారు రూ.98వేల కోట్ల మూలధన వ్యయాన్ని లక్ష్యంగా చేసుకున్నాయని తెలియజేశారు.

నేర్చుకున్న పాఠాలను నిత్యజీవితంలో వాడుకోవాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

నేర్చుకున్న పాఠాలను నిత్యజీవితంలో వాడుకోవాలని పుత్తూరు ఉప విద్యాశాఖాధికారి రఘురామయ్య, మండల విద్యాశాఖ అధికారి తిరుమలరాజు పేర్కొన్నారు. మండల పరిషత్ ఉన్నత బాలికల పాఠశాలలో మండల స్థాయి వైజ్ఞానిక ముగింపు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ నిత్యజీవితంలో సమస్యలను వైజ్ఞానిక శాస్త్రంతో సులభంగా పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం వైజ్ఞానిక ప్రదర్శనల పోటీల్లో జిల్లాస్థాయికి ఎంపికైన ప్రదర్శనలు చేపట్టిన విద్యార్థులు భాస్కర్, గౌతమ్, జస్వంత్, గౌతంలను అభినందించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయురాలు పుష్ప, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సురేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం, గురువారం రెండు రోజుల పాటు జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనల్లో జిల్లాస్థాయికి ఎంపికైన విద్యార్థులకు గురువారం బహుమతులను అందించారు. ఎంఈవో కోమలదేవి, ప్రధానోపాధ్యాయులు దొరస్వామి, మునిరత్నం, మనోజ్ కుమార్, సైన్స్ ఉపాధ్యాయులు, పీడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్ విద్యార్థుల విజయకేతనం

ప్రజాశక్తి-తిరుపతి మంగళం

హైదరాబాద్‌లోని సెయింట్ మేరీ కళాశాలలో గ్జావియర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ వారి ఆధ్వర్యంలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రస్థాయి డిబేట్ పోటీల్లో తిరుపతి నగర పరిధిలోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. విద్యార్థులు సాహిత్య, నాగసాయి, ద్యుతి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.15 వేలు నగదు బహుమతిని అందుకున్నారని ఎమరాల్డ్స్ విద్యాసంస్థల డైరెక్టర్లు గిరిధర్, విశ్వనాధ్ తెలిపారు. ద్వితీయ స్థానంతో దక్షిణ భారత స్థాయిలో నిర్వహించే పోటీలకు అర్హత సాధించారన్నారు. ప్రాంతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో శర్వాణి, తనూజ బందం ప్రథమ స్థానంలో నిలిచి రూ.10 వేలు నగదు బహుమతిని, సాహిత్య, నాగసాయి ద్యుతి బందం ద్వితీయ స్థానాన్ని సాధించి రూ.6 వేలు నగదు బహుమతిని గెలుపొందారన్నారు. డిబేట్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యాసంస్థల ఉప సంచాలకులు మునిరత్నం, జానకిరామ్, పార్థసారథి, నాధముని, శ్రీనివాసులు, ప్రిన్సిపల్ జాఫర్‌వల్లీ పాల్గొన్నారు.



జీవో 1235ను అమలు చేయాలి: కేవీపీఎస్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

యర్రావారిపాలెం మండలం నెరబైలు పంచాయతీ చల్లకుంట దళితవాడకు జీవో నెంబర్1235ను వెంటనే అమలు చేసి స్మశానం స్థలం, దారి సమస్య పరిష్కారం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షులు మునిరామయ్య, జిల్లా కార్యదర్శి దేశాండీ అరుణాచలం సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. దళిత, గిరిజనలందరూ ఆత్మగౌరవంగా బతకడం కోసం జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సులు అమలు చేయాలని.. అందులో భాగంగా జీవో నెంబర్ 1235 ను అమలు చేసి ప్రతి దళితవాడకు రెండు ఎకరాల స్మశాన స్థలం, ప్రత్యేక నిధులతో ప్రహరీ, నీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఇప్పటికైనా ఎర్రావారిపాలెం మండల రెవెన్యూ అధికారులు స్పందించి చల్లకుంట దళితవాడకు ప్రత్యేక స్మశాన స్థలం కేటాయించి దారి సమస్యను పరిష్కరించాలని కోరారు.

పేదల కలల సాకారమే ప్రభుత్వ ధ్యేయం : ఆర్‌కె రోజా

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

పేదవారి ఇంటి కలను నెరవేర్చడమే ప్రభుత్వ ధ్యేయమని.. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. మంత్రితోపాటు చిత్తూరు జిల్లా కలెక్టర్ హరినారాయణన్‌తో కలసి నగరి నియోజకవర్గంలో నింద్ర మండలం ఆరూరు ఎస్.టి కాలనీలో గురువారం గహ ప్రవేశాలు చేయించారు. 26 మందికి రూ.46.80 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన జగనన్న కాలనీ ఇళ్లను ప్రారంభోత్సవం చేసి లబ్ధిదారులకు అందించామన్నారు. రాష్ట్రంలో ప్రతి ఆడపడుచూ కలలను నిజం చేస్తున్న వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. రాష్ట్రం విడిపోయినా జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సమస్యలను తీర్చడం బాధ్యతగా భావిస్తూ నేడు ఇళ్లు కట్టించి ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ప్రతి కుటుంబం బాగుండాలంటే ఆడపడుచులు చదువుకోవాలన్నారు. ఒక్క ఇల్లు కూడా కట్టలేదని విమర్శించే పవన్ కళ్యాణ్ లాంటి వాళ్లు కొన్ని ఊర్లకు వెళ్లి చూస్తే తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, రాష్ట్ర డైరెక్టర్లు, నాయకులు శ్యామ్‌లాల్, జిల్లా గహ నిర్మాణ శాఖ అధికారులు, ఆర్డీవో, ఎంపీడీవో, తహసీల్దారు, మండల అధికారులు పాల్గొన్నారు.

26లోపు ఓటర్ల అభ్యంతరాలను పరిష్కరించాలి: కలెక్టర్

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ప్రత్యేక ఓటర్ల సవరణ, ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల ప్రత్యేక ఓటర్లపై విజయవాడ నుంచి చీఫ్ ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్‌లో గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లతో సమావేశమయ్యారు. అసెంబ్లీ నియోకవర్గాల వారీగా క్లెయిములు, అభ్యంతరాలు తదితర అంశాలపై సమీక్షించారు. క్లెయిములు, అభ్యంతరాలన్నింటినీ ఈనెల 26వ తేదీలోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఈసీఐ మార్గదర్శకాలను అనుసరించి పీఎస్ఈ, డీఎస్ఈలు చేపట్టాలని.. క్షేత్ర స్థాయిలో బీఎల్‌వోలు తనిఖీ చేసి అందించిన నివేదిక ఆధారంగా, నిబంధనల మేరకు ఎస్.ఎస్.ఆర్-2023 లో చర్యలు చేపట్టాలన్నారు. కొత్తగా ఓటర్ల నమోదుకు మొబలైజ్ చేయడంలో పురోగతి చూపించినందుకు జిల్లా కలెక్టర్‌ను సీఈవో అభినందించారు. సమీక్షలో డీఆర్‌వో శ్రీనివాసరావు, నియోజకవర్గ ఈఆర్‌వోలు కిరణ్ కుమార్(గూడూరు), శ్రీనివాసులు(వెంకటగిరి), కనకనరసారెడ్డి(చంద్రగిరి), అనుపమ అంజలి(తిరుపతి), శ్రీనివాసరావు(సత్యవేడు), ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి సుష్మకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోట

శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన ఫణేంద్రకుమార్ నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామానికి చెందిన బాణాల. శీనయ్య కుమార్తె విద్యార్థి సుష్మకు రూ.13 వేలు ఆర్థిక సాయం అందించారు. విద్యార్థిని కోటలోని ప్రగతి విద్యా సంస్థల్లో ఇంటర్మీడియట్ చదువుతోంది. కార్యక్రమంలో శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు అల్లం రమణయ్య, ప్రగతి కళాశాల కరెస్పాండంట్ పసుపులేటి.కిషోర్ బాబు, ఆవుల.సుబ్బయ్య, పన్నగ.సాయి పాల్గొన్నారు.

క్రైం న్యూస్



చెరువులో పడి తల్లీబిడ్డలు మృతి

ప్రజాశక్తి-ఓజిలి

చెరువులో పడి తల్లీబిడ్డలు మృతిచెందిన సంఘటనతో కొత్తపేట గ్రామంలో గురువారం విషాదం నెలకొంది. తల్లితోపాటు ఇద్దరు చిన్నారులు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందడంతో గ్రామంలో విషాదకరంగా మారింది. వివరాలిలా.. ఓజిలి మండల పరిధిలోని కొత్తపేట గిరిజన కాలనీకి చెందిన కోట్లపాటి సునీత (32) గురువారం మధ్యాహ్నం తన ఇద్దరు బిడ్డలు వైష్ణవి (9), వరుణ్‌తేజ(2)లను వెంటబెట్టుకుని గిరిజన కాలనీకి అతి సమీపంలో ఉన్న చెరువు వద్దకు బట్టలు ఉతికేందుకు వెళ్లింది. తల్లితోపాటు పిల్లలు ప్రమాదవశాత్తు చెరువులో పడి మతిచెందారు. భార్యతోపాటు ఇద్దరు పిల్లలు చనిపోవడంతో సునీత భర్త రమేష్ బోరున విలపించాడు. సమాచారం తెలుసుకున్న తహసీల్దారు లాజరస్, ఎస్సై ఆదిలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. శవపరీక్ష నిమిత్తం మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వీరి మృతిపై పూర్తి వివరాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

కత్తులతో బెదిరించి నగలు అపహరణ

ప్రజాశక్తి-ఓజిలి

పట్టపగలే గుర్తుతెలియని దుండగులు కత్తితో బెదిరించి నగలు దోచుకుపోయిన సంఘటన మండల పరిధిలోని వాకాటివారికండ్రిగ గ్రామంలో జరిగింది. వాకాటివారికండ్రిగలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న పద్మతోపాటు అంగన్వాడీ కేంద్రంలో కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న సరస్వతిలను గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని దుండగులు పాఠశాలలోకి, అంగన్వాడీ కేంద్రంలోకి ప్రవేశించి కత్తులతో బెదిరించారు. వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను అపహరించుకుని వెళ్లారు. పట్టపగలు దుండగులు గ్రామంలోకి ప్రవేశించి బంగారు నగలు దోచుకుపోవడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఆదిలక్ష్మి, ఎంఈవో శైలజ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని సంఘటనపై దర్యాప్తు చేపడుతున్నారు.

గ్రామాల్లో పకడ్బందీగా రీసర్వే

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

మండలంలో రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని పుత్తూరు తహసీల్దారు రవికుమార్ సూచించారు. గురువారం ఆయన తన కార్యాలయంలో డీటీ స్వరూపరాణి, మండల సర్వేయర్ శేషమరాజు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొల్లపల్లి,.శిరుగురాజుపాలెం, కసింకుప్పం, తొరూరు, నేసనూరు, వేపగుంట, ఉత్తరపుకండ్రిగ, తిరుమలకుప్పం గ్రామాల్లో రీసర్వే చేపట్టాలన్నారు. సమావేశంలో వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

సైన్సు మేళాలతో విద్యార్థులు సరికొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని డీవైఈవో రఘురామయ్య పిలుపునిచ్చారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం మండల స్థాయి సైన్సు మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు ఐదు ఉప అంశాలపై 120 ఆవిష్కరణలు చేశారు. అనంతరం విజేతలను ప్రకటించారు. వీరిని జిల్లా స్థాయి సైన్స్ మేళాకు పంపుతామని డీవైఈవో తెలిపారు.

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

తుపాన్ కారణంగా నష్టపోయిన వరద బాధితులకు జీఎంకే ట్రస్టు సహకారంతో రామానాయుడుకాలనీలో నిత్యావసర వస్తువులను గాలి ముద్దుకష్ణమనాయుడు తనయుడు గాలి జగదీష్ చేతులు మీదుగా వరద బాధితులకు పంపిణీ చేశారు. అలాగే విజయపురం మండలం కేవీపురం గ్రామంలోనూ అందించారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌చౌదరి, పుత్తూరు, విజయపురం మండల ప్రజలు పాల్గొన్నారు.

ఇంధన పొదుపుకు అడుగులేద్దాం..!

ప్రజాశక్తి-క్యాంపస్

భవిష్యత్తు అంధకారం కాకుండా నిరంతర వెలుగులు అందించటం కోసం ప్రతిఒక్కరూ ఇంధన పొదుపు కోసం ఒక్క అడుగు వేద్దామని తిరుపతి రూరల్ మండల పరిషత్ అధ్యక్షులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి విద్యుత్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు. ఇంధన పొదుపు అవగాహన కోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ ముద్రించిన గోడ పత్రికలను తుమ్మలగుంటలో గురువారం ఆవిష్కరించారు. ఒక్క వ్యక్తి ఒక్క యూనిట్ విద్యుత్తు ఆదా చేస్తే దేశ వ్యాప్తంగా 135 కోట్ల యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ప్రతి కుటుంబంలో విద్యుత్తు వాడకాన్ని వీలైనంత వరకు తగ్గించి ఇంధన పొదుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. పంచాయతీలలో వీధిదీపాలు పగల్లో విద్యుత్తు దీపాలు వెలుగకుండా చూడాలని.. ఆయా పంచాయతీల సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మాధవరెడ్డి, విద్యుత్ శాఖ ఈఈ వాసురెడ్డి, డీఈ నరేంద్ర, ఏఈఈలు హరి, రజని, నాగరాజు, జనార్దన్, ప్రశాంత్ నాయక్ పాల్గొన్నారు.

రేణిగుంటలో 'ఇదేమి ఖర్మ.. మన రాష్ట్రానికి'..!

ప్రజాశక్తి- రేణిగుంట

పట్టణంలోని గౌరీనగర్‌లో గురువారం టీడీపీ నాయకులు 'ఇదేమి ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహబూబ్‌బాషా, మండల అధ్యక్షులు మునిచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు పుష్పనాథన్, నాయకులు సుధాకర్‌నాయుడు, భాస్కర్‌రెడ్డి, కష్ణకిరణ్, కన్నన్‌రెడ్డి, కుమార్, సంపత్, మురళీ, భాస్కర్‌యాదవ్, మునెయ్య, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి-తిరుపతి మంగళం

సమాజ శ్రేయస్సు కోసం అహర్నిశలు జర్నలిస్టులు శ్రమిస్తుంటారని.. అలాంటి జర్నలిస్టుల పిల్లలుగా సమాజంలో ప్రత్యేక గుర్తింపు వచ్చేలా లక్ష్యాలను చేరుకోవాలని చదలవాడ విద్యాసంస్థల మాజీ అధినేత్రి డాక్టర్ సుచరిత సూచించారు. గురువారం సుచరిత జన్మదినం సందర్భంగా జర్నలిస్టుల పిల్లల్లో ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు 20 మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు ఉపకార వేతనాలను ప్రెస్‌క్లబ్‌లో అందించారు. సమాజం కోసం జర్నలిస్టులు, పోలీసులు చేస్తున్న సేవ అభినందనీయమన్నారు. ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలచంద్ర ఆమె సేవలను కొనియాడారు.

